ఇల్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

నల్లకుంట, మే 24 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు చెత్త, చెదారం, వరదనీరు నిలువకుండా ప్రత్యేకచర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఈగలు, దోమలు వృద్ధి చెందడంతో అనారోగ్యం బారిన పడాల్సి వస్తుందని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి పేర్కొన్నారు. ప్రజలు తమ ఇంటితోపాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శనివారం డివిజన్‌లోని జీహెచ్‌ఎంసీ మలేరియా శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో నాలా కాలువలు, వరదనీటి ప్రాంతాలలో ఫాగింగ్ చేపట్టారు. ఈ పనులను పరిశీలించిన కార్పొరేటర్ మాట్లాడుతూ చెత్త కోసం ఇంటింటికీ వచ్చే చెత్తరిక్షా, ఆటోల్లోనే వేయాలని, రోడ్లు, కూడలి ప్రాంతాలలో వేయొద్దని సూచించారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ మలేరియా శాఖ ఈగలు, దోమల నివారణ కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నదన్నారు. దోమల బెడద నివారణను సామాజిక బాధ్యతగా ప్రజలు స్వీకరించాల్సిన అవసరం ఉందని ఆమె కోరారు.

టీడీపీ మహానాడుకు భారీగా జనసమీకరణ

నల్లకుంట, మే 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు జయంతిని పురస్కరించుకుని ఈనెల 27, 28, 29వ తేదీలలో కడపలో జరిగే టీడీపీ మహానాడును జయప్రదం చేసేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచి పెద్దఎత్తున జనసమీకరణ చేపడుతున్నట్లు ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి, మహానాడు అలంకరణ కమిటీ సభ్యుడు నల్లెల కిషోర్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కె.కిరణ్‌కుమార్ వెల్లడించారు. ఈ మేరకు ఏపీ చంద్రగిరి ఎమ్మెల్యే, టీడీపీ మహానాడు అలంకరణ కమిటీ కన్వీనర్ పులివర్తి నాని, పార్టీ ఏపీ కార్యదర్శి, అలంకరణ కమిటీ కో-కన్వీనర్ ఎం.వెంకటేశ్వర్లును శనివారం తెలంగాణ రాష్ట్రం నుంచి టీడీపీ నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడపలో టీడీపీ మహానాడు ప్రాంగణంలో అలంకరణ, తెలంగాణ రాష్ట్రం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలింపు ఇతరత్ర అంశాలపై చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రదీప్‌గౌడ్, శ్యామ్‌కుమార్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అందాల పోటీలతో తెలంగాణ కీర్తి విశ్వవ్యాప్తం


మాట్లాడుతున్న తొలుపునూరి కృష్ణగౌడ్

బర్కత్‌పుర, మే 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న అందాల పోటీలతో తెలంగాణ కీర్తి విశ్వవ్యాప్తం అయ్యిందని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ పేర్కొన్నారు. ఈ ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. శనివారం కాచిగూడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందాల పోటీలతో ప్రపంచం అంతా ఇప్పుడు హైదరాబాద్ వైపు చూస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన రాజీవ్ యువ వికాస పథకంతో నిరుద్యోగుల జీవితాలలో వెలుగులు నింపనుందన్నారు. ఈ పథకం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శం కాబోతుందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు జారీ చేయబోతుందని, ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగాల భర్తీతో అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

● నాలాలో పూడికతీత పనుల పరిశీలన



కాచిగూడ డివిజన్ పరిధిలోని హిమాయత్‌నగర్ నాలాలో పూడి కతీత పనులను శనివారం జీహెచ్‌ఎంసీ చేపట్టింది. ఈ పనులను కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

– బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

● మరణించిన కళాకారులకు ఆర్థిక సహాయం



తెలంగాణ సాంస్కృతిక సారథిలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన కళాకారులకు ఆర్థిక సహాయం చెక్కులను వారి కుటుంబాలకు శనివారం పంపిణీ చేశారు. సాంస్కృతిక సారథి కార్యాలయంలో సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్ డాక్టర్ జీవీ.వెన్నెల గద్దర్ ఈ చెక్కులను అందజేశారు. సారథి కళాకారులు చిప్పలపల్లి సుధాకర్, వేముల నరేష్, గడ్డం ఈశ్వర్ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5.22లక్షలను అందజేశారు. – బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

'పంజాబ్‌లో అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలి'

రాంనగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): పంజాబ్‌లో అరెస్ట్ చేసిన జెమిన్ ప్రాప్తీ సంఘ సేవా సమితి నాయకులను విడుదల చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో శనివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్ నుంచి రాంనగర్ చౌరస్తా వరకు నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ, నాయకులు జి.అనురాధ, శివబాబు, అరుణ, అనసూయ, నాగరాజు, యాదన్న, పద్మ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

27న తెలంగాణ ఉద్యమకారుల నిరాహార దీక్ష

చిక్కడపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ఒకరోజు నిరాహారదీక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉద్యమకారుల జేఏసీ ఛైర్మన్ సుల్తాన్‌యాదగిరి, ప్రధానకార్యదర్శి తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి తెలిపారు. ఒకరోజు నిరాహార దీక్ష కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీలో వారు తెలంగాణ ఉద్యమకారులు, బస్తీప్రజలతో కలిసి ఆవిష్కరించారు. జేఏసీ కోశాధికారి చంద్రశేఖర్‌ప్రసాద్, వేదిక అధ్యక్షుడు యాదగిరి, టీజేఎస్ నేత శ్రీనివాస్‌యాదవ్, మల్లేష్, సాయి పాల్గొన్నారు.

ఇద్దరి వృద్ధుల అదృశ్యం

బర్కత్‌పుర, మే 24 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ పీఎస్ పరిధిలో వేర్వేరు సంఘటనలో ఇద్దరు వృద్ధుల అదృశ్యమయ్యారు. కాచిగూడ అడ్మిన్ ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... చప్పల్‌బజార్‌లో నివాసం ఉంటున్న ఎల్.స్వరూప(62) ఈనెల 22న మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాలు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో కుమారుడు ఎల్.శ్రీనాథ్ శనివారం రాత్రి కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. మరో సంఘటనలో నాగుల ఎల్లయ్య(70) తన భార్య నాగుల లక్ష్మీతో కలిసి కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వెళ్లడానికి ఆలీకేఫ్ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కారు. ఆక్వా హోటల్ చౌరస్తా వద్ద భార్య బస్సు దిగాక భర్త దిగలేదు. పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. భార్య నాగలక్ష్మి శనివారం రాత్రి కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ రెండు సంఘటనలపై కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని మహిళ మృతి

బర్కత్‌పుర, మే 24 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మహిళ మృతి చెందింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్రీనాకలో నివాసం ఉంటున్న హేమలక్ష్మి(49) కూలీ. యాకత్‌పుర - ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య శనివారం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు ప్రయాణికుడి ల్యాప్‌టాప్, బ్యాగు చోరీ

రైలు ప్రయాణికుడి ల్యాప్‌టాప్, బ్యాగును దొంగలు తస్కరించారు. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. నాగపూర్‌కు చెందిన సాయిధనూష్(30) ఈనెల 21న కడపలో నాగపూర్ వెళ్లడానికి ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎక్కాడు. కాచిగూడకు రాగానే ల్యాప్‌టాప్ బ్యాగు కనిపించలేదు. నాగపూర్ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. తదుపరి విచారణ నిమిత్తం ఈ కేసును కాచిగూడ రైల్వే పీఎస్‌కు బదిలీచేశారు. బ్యాగులో ల్యాప్‌టాప్, రూ.3వేల నగదు, డెబిట్, క్రెడిట్ కార్డులు ఉన్నాయి.

పార్టీ కోసం పనిచేసే వారికే భవిష్యత్‌లో పదవులు

ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్


మాట్లాడుతున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, వేదికపై పార్టీ పరిశీలకులు రాచమల్ల సిద్దేశ్వర్, తదితరులు

రాంనగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం అంకితభావంతో పనిచేసే వారికే భవిష్యత్‌లో పార్టీ, నామినేటెడ్ పదవులు వస్తాయని, పనిచేయని వారు మర్యాదపూర్వకంగా పార్టీ పదవుల నుంచి తప్పుకుని చేసే వారికి అవకాశం ఇవ్వాలని రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ సూచించారు. శనివారం లలితానగర్ కమ్యూనిటీహాల్‌లో ముషీరాబాద్ బీ బ్లాక్ పరిధిలోని రాంనగర్, అడిక్‌మెట్, ముషీరాబాద్ డివిజన్ల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. పార్టీ సీనియర్ నాయకులు పాశం అనిల్‌కుమార్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, పార్టీ పరిశీలకులు రాచమల్ల సిద్ధేశ్వర్, ఆర్.కల్పనాయాదవ్, జీ.ఎస్.కేశవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే గ్రేటర్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసే విధంగా ప్రతి ఒక్కరూ క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో నాయకులు చేసే పనితీరును బట్టి అవకాశాలను అధిష్ఠానం కల్పిస్తుందనే విషయాన్ని మరచిపోవద్దని అన్నారు. వారం రోజుల్లో డివిజన్ల అధ్యక్షులు తమ పరిధిలోని బూత్‌కు అయిదు మంది చొప్పున క్రియాశీల కార్యకర్తల జాబితాను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్, బీ బ్లాక్ అధ్యక్షుడు అంజియాదవ్, డివిజన్ అధ్యక్షుడు తిరుమల్, కాంగ్రెస్ నాయకులు జీ.ఎన్.కేశవ్, విజయ్‌కుమార్‌యాదవ్, మనోహర్‌సింగ్, సుధేష్, లోకేష్‌యాదవ్, విజయ్ యాదవ్, గూడబోయిన గోవింద్, పట్నం నాగభూషణం, కవిత, గజ్జెల సూర్యనారాయణ, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం

● ఎమ్మెల్యే ముఠా గోపాల్ ● డ్రైనేజీ పైప్‌లైన్ పూర్తైన వెంటనే రోడ్ల నిర్మాణం


భోలక్‌పూర్‌లోని బొంతల బస్తీలో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు

ముషీరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధిపనుల్లో ఇంజనీరింగ్ విభాగం అధికారుల నిర్లక్ష్యం అధికంగా ఉందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ విమర్శించారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని బొంతల బస్తీలో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను జలమండలి డీజీఎం కార్తీక్‌రెడ్డి, సెక్షన్ మేనేజర్ శ్రీధర్, జీహెచ్‌ఎంసీ ఏఈ సుభాష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. బొంతలబస్తీలో డ్రైనేజీ సమస్య వల్ల ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్ల నిర్మాణంలో పూర్తిగా నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తున్నారని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పలు మార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రణాళికాబద్ధంగా నెరవేర్చుతున్నామన్నారు. అందులో భాగంగా బొంతల బస్తీలో దశాబ్దాల కాలంగా ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించామని పేర్కొన్నారు. అనంతరం ముషీరాబాద్ కృష్ణకాలనీ పార్కును సందర్శించి కాలనీ వాసులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, బీసీ సెల్ అధ్యక్షుడు ఉమాకాంత్, పార్టీ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, కృష్ణ, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, సాయికుమార్, నర్సింగ్‌రావు, మగ్బూల్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు: ఎమ్మెల్యే

రాంనగర్: ముషీరాబాద్ నియోజకవర్గంలోని ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. శనివారం అడిక్‌మెట్ డివిజన్‌లోని అడిక్‌మెట్ ఫ్లైఓవర్ కింద గల ముస్లిం శ్మశానవాటికలో రూ.14 లక్షలతో చేపట్టనున్న వాజుఖానా, ముస్లింఖానా, బోరింగ్ ఇతరత్ర పనులను ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంటుందన్నారు. ఈ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బల్ల శ్రీనివాస్‌రెడ్డి, కె.సురేందర్, నాయకులు చిట్టి, యూనస్, మాధవ్, భిక్షపతి, మహ్మద్, అబ్బు, రాజు, ఇమామ్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బుర్ర సాయిమాధవ్‌కు ఎన్టీఆర్ పురస్కారం బహూకరిస్తున్న అతిథులు

సినీ సంభాషణారచనల్లో అగ్రగణ్యుడు బుర్ర

చిక్కడపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): సమయం లేదు మిత్రమా, రావటం లేటైనా రావడం పక్కా, రణమా శరణమా వంటి డైలాగులు గుర్తుండేలా రాసిన బుర్ర సాయిమాధవ్ సినీ సంభాషణారచనల్లో అగ్రగణ్యుడు అని కేంద్ర మాజీ మంత్రి డా.సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. కళారవిందం సంస్థ వార్షికోత్సవం సందర్భంగా శనివారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రముఖ సినీ రచయిత బుర్ర సాయిమాధవ్‌కు డా.ఎన్‌టీ.రామారావు కళా సాహితీ జాతీయ పురస్కార ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన డా.సముద్రాల వేణుగోపాలచారి పురస్కారం బహూకరించి మాట్లాడారు. ఎన్‌టీ.రామారావు వల్లనే తాము రాజకీయాలలోకి వచ్చామన్నారు. ప్రముఖ సాహితీవేత్త డా.ఓలేటి పార్వతీశం అధ్యక్షత వహించారు. సంస్థ నిర్వాహకులు రామ్‌కుమార్ స్వాగతం పలికిన సభలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, సంఖ్యాశాస్త్రవేత్త దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు. తొలుత గాయకుడు రామ్‌కుమార్, అఖిల, రామలక్ష్మి, భార్గవి, నాగరాజు, శ్యామ్‌సుందర్, కశ్యప్, ఆర్తి తదితరులు ఎన్‌టీఆర్ సినిమాల్లోని పాటలను మధురంగా గానం చేశారు.

తులసీరాంనగర్‌లో అధికారుల పర్యటన

గోల్నాక, మే 24 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్‌లోని తులసీరాంనగర్ కొన్ని ఇళ్లకు సంబంధించిన డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం నాలాలో పైప్‌లైన్ వేసి సమస్యను పరిష్కరించారు. కొంతకాలంగా డ్రైనేజీ పైపులైన్లలో చెత్తాచెదారం నిండిపోయి మురికినీరు తిరిగి ఇళ్లలోకి రావడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు వివరించి పరిష్కరించాలని కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే అధికారులను శనివారం అక్కడికి పంపించారు. శనివారం జలమండలి జీఎం రామకృష్ణ, డీజీఎం విష్ణువర్ధన్, మేనేజర్ రోహిత్‌లు సందర్శించి డ్రైనేజీ దుస్థితిని పరిశీలించారు. జలమండలి అధికారులు బస్తీకి సివరేజీ సిబ్బందిని పంపించి, పైపులైన్లలో పేరుకపోయిన చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. మురుగునీరు ఆగకుండా సాఫీగా వెళ్లేలా చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆర్.దేవేందర్, పడకంటి అంజయ్యచారి, ప్రభాకర్ ముదిరాజ్, పి.సంతోష్‌కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు తవ్వకం వివాదాస్పదం

అధికారులు, స్థానికుల మధ్య వాగ్వావాదం ● నిలిచిపోయిన పనులు

రాంనగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని బాకారంలో నూతనంగా రూ.20 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు తవ్వకాల పనులు వివాదాస్పదంగా మారాయి. బాకారం పోచమ్మ ఆలయం చౌరస్తా నుంచి బాకారం మెయిన్ రోడ్డు వరకు సీసీ రోడ్డు పనులకు కొద్ది రోజుల క్రితం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ శంకుస్థాపన చేశారు. ఈ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులు శనివారం కాంట్రాక్టర్ ద్వారా పాత రోడు పనులు చేపట్టారు. ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లడానికి వీలుగా సగం రోడ్డు వేసిన తర్వాత మిగిలిన రోడ్డు వేయాలని స్థానికులు కె.నర్సింగ్‌రావు పలువురు రోడ్డు తవ్వకాలను అడ్డుకున్నారు. దీంతో కాంట్రాక్టర్ పనులు ఆపి ఈ విషయాన్ని జీహెచ్‌ఎంసీ డీఈ గీత, ఏఈ వినోద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివకు తెలిపారు. వారు అక్కడికి చేరుకుని రోడ్డు మొత్తం ఒకేసారి తవ్వి ఒకేసారి వేస్తామని, సగంసగం వేయడం కుదరని స్థానికులతో చెప్పారు. అలా అయితే తమకు చాలా ఇబ్బంది అవుతుందని స్థానికులు చెప్పారు. దీంతో అధికారులు, స్థానికుల మధ్య వాగ్వావాదం నెలకొంది. స్థానికులు ఒప్పుకోకపోవడంతో అధికారులు రోడ్డు తవ్వకాలను నిలిపేసి వెళ్లిపోయారు. ఈ తర్వాత అధికారులు, స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని చర్చించి ప్రజలకు ఇబ్బందులు జరగకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు.

'ఫ్యూరోపాల్' బాధితులకు న్యాయం చేయాలి : ఆప్

కవాడిగూడ, మే 24 (ఆంధ్రజ్యోతి): నేరపూరిత నమ్మక ద్రోహం చేస్తున్న హైదరాబాద్, మాదాపూర్, గచ్చిబౌలిలోని స్కిల్ హబ్‌వంటి నకిలీ ఐటీ జాబ్ కన్సల్టెన్సీలను మూసివేయాలని, బోర్డు తిప్పేసిన ఫ్యూరోపాల్ క్రియేషన్స్ అండ్ ఐటీ సొల్యూషన్స్ కంపెనీ బాధితులకు న్యాయం చేయాలని ఆమ్‌ఆద్మీపార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో శనివారం సంస్థ బాధిత నిరుద్యోగులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధకార్ మాట్లాడుతూ, ఫ్యూరోపాల్ ఐటీ కంపెనీ వల్ల దాదాపు 200 మంది ఉద్యోగులు రోడ్డున పడ్డారని చెప్పారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేసి వారం రోజులు గడిచినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఆప్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు విజయ్ మల్లంగి మాట్లాడుతూ, నగరంలోని మాదాపూర్, గచ్చిబౌలిలో రోజురోజుకు భారీ ఐటీ ఉద్యోగాల మోసాలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర నేత బుర్రా రాముగౌడ్, ఆప్ నేతలు డాక్టర్ లక్ష్య నాయుడు, రాకేష్‌రెడ్డి, బాబులాల్ పవార్, అజీమ్‌బేగ్, షాబాజ్ లిఖాయత్‌ఖాన్, హేమజిల్లోజు, మదన్‌లాల్, గుత్తా నాగేశ్వర్‌రావు, టి.రాకేష్‌సింగ్, సోహైల్, రామన్‌స్వామి, రమేష్, అబ్బాస్ జీషాన్‌తో పాటు బాధితులు పాల్గొన్నారు.

డొనేషన్లను నియంత్రించాలి : ఆర్.కృష్ణయ్య


మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యం కోటా సీట్ల డొనేషన్లను ప్రభుత్వం నియంత్రించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. యాజమాన్యం కోటా ఇంజరీనింగ్ సీట్లను రూ.10లక్షల నుంచి రూ.20 లక్షల చొప్పున అమ్ముకుంటూ పేదప్రజలను దోచుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు జి.అనంతయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్‌ల అధ్యక్షతన 14 బీసీ కుల సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాజమాన్యం కోటా సీట్లను 40 నుంచి 30 శాతానికి తగ్గించాలని, యాజమాన్యం కోటా సీట్లను ఆన్‌లైన్ పద్ధతిలో భర్తీ చేసి ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులకే సీట్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు జిల్లపల్లి అంజి, మోదీ రాందేవ్, మణికంఠ, జి.మల్లేష్‌యాదవ్; సి.రాజేందర్, ఎన్.వీరన్న, జి.కృష్ణయాదవ్, కె.నర్సింహగౌడ్, బర్క కృష్ణ, వెంకన్నగౌడ్, టి.ఆర్.చందర్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ నుంచి ఎస్ఐగా..



కవాడిగూడ, మే 24 (ఆంధ్రజ్యోతి): దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పూజారి తిరుపతికి ఎస్ఐగా పదోన్నతి లభించింది. 1984 సంవత్సరంలో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. 2012లో హెడ్‌కానిస్టేబుల్, 2018 ఏఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందారు. ఈనెల 20వ తేదీన పూజారి తిరుపతి ఎస్ఐగా ప్రమోషన్ పొందారు. ఈ సందర్భంగా పూజారి తిరుపతి మాట్లాడుతూ, తాను పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో 41 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ శాంతిభద్రల పరిరక్షణలో తన వంతు బాధ్యత పోషిస్తున్నట్లు ఆయన తెలిపారు.

'ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా డీఈఓలను భర్తీ చేయాలి'

కవాడిగూడ, మే 24 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలోని డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకోసం గ్రూప్ వన్‌తో కలిపి కాకుండా ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని శనివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సింగరి శ్రీపాల్‌రెడ్డికి సాంఘిక శాస్త్ర ఫోరం నేతలు డాక్టర్ నాగయ్య, బాలాజీ, రమేష్ నేతృత్వంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ సమస్యల పట్ల ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నోటిఫికేషన్‌తో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ల పోస్టుల భర్తీని పూర్తిచేసే విధంగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

'భోల్‌పూర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి'

ముషీరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లో డ్రైనేజీ, మంచినీరు, రోడ్ల ఆధునికీకరణకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. శనివారం భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్‌నాయకుడు అక్లక్ హుస్సేన్ ముఠా జైసింహను కలిసి భోలక్‌పూర్‌లోని ఇందిరానగర్, రంగానగర్, సిద్ధిక్‌నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జైసింహ మాట్లాడుతూ... ఆయా ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

'ఆదివాసులను కాల్చిచంపడం దుర్మార్గం'

చిక్కడపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్‌లో 26 మంది ఆదివాసులను కాల్చిచంపడం దుర్మార్గమైన చర్య అని తెలంగాణ ప్రజాస్వామిక వేదిక కన్వీనర్ చిక్కుడు ప్రభాకర్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో శాంతిచర్చలకు సిద్ధపడిన ఆజాద్‌ను, మావోయిస్టు పార్టీ ప్రధానకార్యదర్శి సంబళ్ల కేశవరావుతోపాటు ఆదివాసులను ఇటీవల ఎన్‌కౌంటర్ చేశారని ఆరోపించారు. ఈ ఫాసిస్టు చర్యను దేశప్రజలందరూ ఖండించాలన్నారు. మధ్యభారతంలోని బేస్‌క్యాంపులను, పారామిలటరీ బలగాలను సైన్యాన్ని వెంటనే వెనక్కి రప్పించి, చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

కథారచనలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయి

చిక్కడపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): కథారచనలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయని ప్రముఖ కథారచయిత్రి కామరాజుగడ్డ వాసవదత్త రమణ అన్నారు. మెదక్ జిల్లా ప్రజ్ఞాపూర్‌కు చెందిన భూపతి చంద్ర మెమోరియల్ ట్రస్ట్ సంస్థ వారు ఇటీవల నిర్వహించిన కథారచన పోటీల్లో కామరాజుగడ్డ వాసవదత్త రమణ రచించిన సాగనీ పయనం కథకు ఉత్తమ బహుమతి వచ్చింది. ఈ సందర్భంగా మెదక్ జిల్లా జెడ్పీ మాజీ ఛైర్మన్ కాంతారావు, ప్రముఖ సినీదర్శకుడు బి.నరసింగరావు, సీనియర్ జర్నలిస్ట్ కె.రామచంద్రమూర్తి వాసవదత్త రమణకు బహుమతి అందజేసి, సన్మానించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

చిక్కడపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): రెండునెలలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గాంధీనగర్ డివిజన్ వాల్మీకినగర్, గిరినగర్ వాసులు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు విజ్ఞప్తి చేశారు. బస్తీల్లో ముషీరాబాద్ ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు ఆయనను కలిసి తమ సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా తనతోపాటు పర్యటనలో పాల్గొన్న వాటర్‌బోర్డ్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, గాంధీనగర్ మేనేజర్ కృష్ణమోహన్‌ను పిలిపించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

సీఐకి సత్కారం



గాంధీనగర్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎన్.బోస్‌కిరణ్‌ను శనివారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా నగర కార్యవర్గ సభ్యుడు ప్రేమ్‌కుమార్, పార్టీ సీనియర్ నేత రవికుమార్, ఆరుట్ల మహేష్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

– కవాడిగూడ, ఆంధ్రజ్యోతి